సర్దార్ స్ఫూర్తిని కొనసాగిద్దాం


పటేల్‌కు నివాళులర్పిస్తున్న ఎస్పీ మలికా గర్గ్


వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలతో ఎస్పీ మలికా గర్గ్

● ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: స్వాతంత్ర్యానంతరం దేశ ప్రజల మధ్య ఐక్యత, సామరస్యతకు పునాదులు వేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిని కొనసాగిద్దామని ఎస్పీ మలికా గర్గ్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ 148వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉక్కుమనిషి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానంతరం దేశంలోని స్వతంత్ర సంస్థానాలన్నిటినీ దేశంలో విలీనం చేయడంలో ఆయన ప్రదర్శించిన పట్టుదల ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. ఆయన సంకల్పాన్ని భవిష్యత్ తరాలు ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

పోటీల్లో విజేతలకు బహుమతులు

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని అన్ని సబ్ డివిజన్లలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలతోపాటుగా రన్ ఫర్ యూనిటీ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు అందించారు. కార్యక్రమంలో ఏఆర్ ఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఆర్‌ఐలు శ్రీహరి రెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ మోసాలను అరికట్టడంలో సాంకేతిక పాత్ర అంశంపై పోటీల్లో విజేతలుగా నిలిచిన పోలీసు సిబ్బంది

మొదటి బహుమతి : డి.శ్రీనివాసరావు(టుంగుటూరు) , ద్వితీయ బహుమతి : ఒ.నారాయణ రెడ్డి(సంతనూతలపాడు) , తృతీయ బహుమతి : జాన్ వెస్లీ(సంతనూతలపాడు)

లైంగిక వేదింపుల నుంచి మహిళలు, పిల్లల రక్షణలో సామాజిక పాత్రపై వ్యాస రచనలో విజేతలుగా నిలిచిన పోలీసుల పిల్లలు

పి.భానమతి తేజశ్వని(అపెక్స్ హైస్కూలు, ఒంగోలు), టి.కీర్తన(సంస్కృతి హై స్కూలు, కందుకూరు) , కె.మనోజ్ఞ(అపెక్స్ హైస్కూలు)

లైంగిక వేదింపుల నుంచి మహిళలు, పిల్లల రక్షణలో సామాజిక పాత్రపై వక్తృత్వ పోటీల్లో..

షేక్ నిమ్రా(జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, కనిగిరి)

ఎస్.సాయి సహస్ర (పివిఆర్ బాలికల ఉన్నత పాఠశాల, ఒంగోలు)

ఎస్.శ్రావణి (జెడ్పీ హైస్కూల్, త్రిపురాంతకం)

వక్తృత్వ పోటీల్లో..

ఎస్డీ అర్మాన్(అపెక్స్ హైస్కూలు, ఒంగోలు)

కె.మహిత(క్విస్ హైస్కూలు, ఒంగోలు)

వై.నిశిత(పేస్ ఎస్ఆర్ ఒలింపియాడ్ స్కూలు, ఒంగోలు)

రన్ ఫర్ యూనిటీలో విజేతలు

వై.క్రాంతి కుమార్

టి.చిన్న రోశయ్య

ఎ.శ్రీనివాసరావు


ఐక్యతా పరుగులో పోలీస్ అధికారులు, సిబ్బంది

దేశ సమైక్యతకు అంకితమవుదాం

● అడ్మిన్ ఏఎస్పీ నాగేశ్వరరావు
● ఘనంగా రన్ ఫర్ యూనిటీ

ఒంగోలు టౌన్: తొలి ఉప ప్రధానిగా, హోంశాఖ మంత్రిగా దేశ సమగ్రత కోసం పాటుపడిన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో దేశ సమైక్యతకు అంకితమవుదామని అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభాయ్ జయంతిని పురస్కరించుకుని ప్రకాశం భవనం వద్ద రన్ ఫర్ యూనిటీని ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు జెండా ఊపి ప్రారంభించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరేడ్ గ్రౌండులో సర్దార్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందితో దేశ ఐక్యత, సమగ్రతను కాపాడడానికి పునరంకితం అవుతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామి రెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు, దిశ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, సీఐలు పి.భక్తవత్సల రెడ్డి, లక్ష్మణ్, జగదీష్, అజయ్‌కుమార్, ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు, సీతారామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుంచేపల్లి పంచాయతీలో నిధులు గోల్‌మాల్

● రూ.2.23 లక్షలు కాజేసిన పంచాయతీ కార్యదర్శి

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని కుంచేపల్లి పంచాయతీలో రూ.2.23 లక్షల నిధులు గోల్‌మాల్ అయిన వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న నారాయణ ఈ ఏడాది జూలైలో మర్రిపూడి మండలంలోని ధర్మవరం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. వైఎస్సార్ బీమాకు సంబంధించి రూ.20 వేలు, పంచాయతీలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిధులు రూ.2.03 లక్షలు.. వెరసి మొత్తం రూ.2.23 లక్షలను పంచాయతీ నిధుల నుంచి డ్రా చేసి సొంతానికి వాడుకున్నారు. ధర్మవరంలోనూ రూ.2.50 లక్షలు స్వాహా చేయడంతో అక్కడి అధికారులు ఎల్‌పీసీ సర్టిఫికెట్ ఇవ్వలేదు. దీంతో ఇక్కడ అధికారులు ఆయనకు గత నాలుగు నెలల నుంచి వేతన బిల్లు పెట్టలేదని సమాచారం. నిధుల గోల్‌మాల్‌పై ఎంపీడీఓను వివరణ కోరగా వాస్తవమేనని, ఈ విషయంపై డీపీఓ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్కాపురం: మార్కాపురం పట్టణ శివార్లలోని అల్లూరి పోలేరమ్మ గుడివద్ద సోమవారం సాయంత్రం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు. తర్లుపాడు మండలం కేతగుడిపి గ్రామానికి చెందిన దూదేకుల సద్దాం హుస్సేన్(35) సోమవారం సాయంత్రం తర్లుపాడు నుంచి మార్కాపురానికి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో అల్లూరి పోలేరమ్మ గుడి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి అంబులెన్స్‌లో జిల్లా వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం సోమవారం రాత్రి ఒంగోలు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

మార్కాపురం: కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగుమందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం మార్కాపురం పట్టణంలోని 10వ వార్డులో చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై కోటేశ్వరరావు కథనం మేరకు.. పదో వార్డులో నివాసముండే దూదేకుల ఖాశింబీ(23) మంగళవారం కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త ఖాశిం, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి గుర్తింపు!

● ప్రత్యేక పోలీస్ బృందాలతో ముమ్మరంగా గాలింపు

మార్కాపురం: దసరా పండుగ రోజున మార్కాపురం పట్టణంలోని ఎస్ఎస్ నగర్‌లో నివాసముంటున్న అర్థవీడు పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ గోపాలరాజు ఇంట్లో చోరీకి పాల్పడిన కేసులో నిందితుడిని రాజమండ్రికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాలను రాజమండ్రితోపాటు హైదరాబాద్‌కు పంపారు. కాగా పట్టణ శివార్లలోని బజాజ్ ఆటో షోరూమ్‌లో ఈ ఏడాది జూలైన 25న రూ.5 లక్షలు నగదు అపహరించిన నిందితుడిని మార్కాపురం మండలం గొట్టిపడియ గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు నిర్ధారించి అదుపులోకి తీసుకున్నారు. అప్పులపాలైన ఆ వ్యక్తి దొంగతనానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది.



2కే రన్ నిర్వహిస్తున్న పోలీసులు


గొట్లగట్టులో ఐక్యతా ర్యాలీలో పాల్గొన్న జెడ్పీ పాఠశాల విద్యార్థులు


ప్రతిజ్ఞ చేస్తున్న పుల్లలచెరువు జెడ్పీ విద్యార్థులు

దేశ సమగ్రతను కాపాడాలి

● డీఎస్పీ వీరరాఘవరెడ్డి

మార్కాపురం: దేశ సమగ్రతను కాపాడటంలో అందరూ సమైక్యంగా ఉండాలని డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి సూచించారు. మంగళవారం సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా స్థానిక పోలీసు స్టేషన్ నుంచి ఐక్యతా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. వల్లభాయ్‌పటేల్ ఆశయాలు కొనసాగించడంతోపాటు శాంతి భద్రతల విషయంలో పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ ఎస్సైలు కోటేశ్వరరావు, వెంకటేశ్వరనాయక్, ఏఎస్సైలు వెంకటేశ్వర్లు, కృష్ణుడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల విద్యార్థులు జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, ఉప సర్పంచ్ గాడి కోనేటిరెడ్డి పాల్గొని ర్యాలీలను ప్రారంభించారు. జడ్పీ పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, కేజీబీవీ ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, బీసీ హాస్టల్ వార్డెన్ ఎస్‌కే ఎండీ కాశిం విద్యార్థులతో ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు 3కే రన్ నిర్వహించారు.

గిద్దలూరు రూరల్: ఉక్కు మనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లబాయ్ పటేల్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఎంపీయూపీ స్కూల్ హెచ్‌ఎం కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి సందర్భంగా పట్టణంలోని యాదవ బజారు ఎంపీయూపీ స్కూల్ ఆవరణలో మంగళవారం పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్దార్ వల్లబాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయులు నారాయణ, రంగస్వామి, బాలవెంకటేశ్వర్లు, లీలావతి పాల్గొన్నారు.

పటేల్ సేవలు చిరస్మరణీయం

పుల్లలచెరువు: సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతిని మంగళవారం మండలంలోని పలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్దార్ వల్లాభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ దేశ సమైక్యతకు పటేల్ చేసిన సేవలు మరవలేనివన్నారు. దేశ సమైక్యతపై విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. పుల్లలచెరువు సచివాలయం–1లో కార్యదర్శి బాలునాయక్ ఆధ్వర్యంలో వలంటీర్లు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

దొనకొండ: స్థానిక రుద్రసముద్రం అడ్డరోడ్డు వద్ద 3 కె రన్ నిర్వహించారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, స్థానిక సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌కుమారి దేవానంద్ జెండా ఊపి ప్రారంభించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు 3కె రన్‌లో పాల్గొన్నారు. ముందుగా సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీడీఓ ఎస్ఎండీ దావూద్, ఎంఈఓ సాంబశివరావు, ఎస్ఐ కె.అంకమ్మ, సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌కుమారి దేవానంద్, కోఆప్షన్ సభ్యులు గఫార్, ఎంపీటీసీలు అజయ్, నగేష్, వైస్ సర్పంచ్ ఇమ్రాన్‌ఖాన్, హెచ్‌ఎం రామాంజనేయులు పాల్గొన్నారు. గంగదేవిపల్లిలో సర్పంచ్ ఎగ్గోని కుమారి, ఉప సర్పంచ్ కర్నాటి ప్రసన్నాంజనేయరెడ్డి పటేల్‌కు నివాళులర్పించారు.


150 అడుగుల జాతీయ జెండాతో మానవహారంగా ఏర్పడిన విద్యార్థినులు

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు జవహర్ నవోదయ, లక్ష్మక్కపల్లి, తుమ్మలచెరువులో జాతీయ ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. లింగారెడ్డికాలనీలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత హెచ్‌ఎం మౌలాలి పటేల్ చిత్రపటానికి నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్

గిద్దలూరు రూరల్: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నేషనల్ డే ఇంటిగ్రిటీ సందర్భంగా మంగళవారం గిద్దలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్ ఆధ్వర్యంలో పట్టణంలోని కుమ్మరాంకట్ట సెంటర్, రాచర్లగేటు సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వరకు 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల జ్ఞాపకార్థంగా ప్రజలతో మమైకం అయ్యేందుకు 2కే రన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కులమతాలకు అతీతంగా కలిసి మెలిసి ఒకే యూనిఫాంలో ప్రజలకు సేవలను అందిస్తామన్నారు. ఎస్ఐలు మహేష్, కృష్ణపావని, ఆరాధ్యుల సుబ్బరాజు, ఏఎస్ఐలు పాల్గొన్నారు.

కంభం: సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీఐ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో కంభం, అర్థవీడు, బేస్తవారిపేట ఎస్ఐలు, సిబ్బంది 2కే రన్ కార్యక్రమం నిర్వహించారు. కంభం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పల్నాటి బోడయ్య ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో కలిసి ఐక్యతా పరుగు కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సీఐ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ దేశ ఐక్యతను, సమగ్రతను, భద్రతను కాపాడిన మహనీయుడు సర్దార్ వల్లబాయ్ పటేల్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సయ్యద్ ఖాసిం, కార్యదర్శులు బ్రహ్మయ్య, ఖాదర్‌వలి పాల్గొన్నారు.

దర్శి: జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా 150 అడుగుల జాతీయ జెండాతో జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఆధ్వర్యంలో మానవహారం ఏర్పాటు చేశారు. పటేల్ సేవలను వివరించారు. హెచ్‌ఎం షేక్ ఖాదర్ మస్తాన్, ఉపాధ్యాయులు కేవీజీ కీర్తి, షేక్ కబీర్, కె. పద్మావతి, కె. లక్ష్మి, రాజ్యం, పీపీ పద్మావతి, టి. భారతి, విజయకుమారి, నాజిని బేగం, ఆదిలక్ష్మి, అనురాధ, హేమలత, నాగజ్యోతి పాల్గొన్నారు.


పటేల్‌కు ఘనంగా నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


కలుజువ్వలపాడులో నవోదయ విద్యార్థుల ర్యాలీ


దొనకొండ: 3కే రన్ ప్రారంభించిన ఎంపీపీ, సర్పంచ్


కంభంలో పోలీసు అధికారుల రన్

పట్టణ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో ప్రాధాన్యతా క్రమంలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని మైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం అమరజీవి పొట్టిశ్రీరాములు కౌన్సిల్ హాల్లో కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్మన్ కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ.. పట్టణంలోని 35 వార్డుల్లో సమస్యలను గుర్తించి సభ దృష్టికి తీసుకొస్తే అజెండాలో రికార్డు చేసి ప్రతిపాదనలతో పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని ఆర్యవైశ్యుల అభిప్రాయాల మేరకు ఆమోదయోగ్యమైన ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ బుశ్శెట్టి నాగేశ్వరరావు సభ దృష్టికి తెచ్చారు. గాంధీ బజారులో ఉన్న మున్సిపల్ స్కూల్ శిధిలావస్థకు చేరిందని, దాన్ని తొలగించి ఆ ప్రాంతంలో షాపులు ఏర్పాటు చేసినట్లయితే మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందని తెలిపారు. 22వ వార్డులో డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, శానిటేషన్ పనులు సరిగా చేయడం లేదని కొట్టే రామలక్ష్మమ్మ సభ దృష్టికి తెచ్చారు. చైర్మన్ స్పందిస్తూ గాంధీ బజారులో పాత స్కూల్ భవనం అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారుచేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వైస్ చైర్మన్ అంజమ్మ, కమిషనర్ గిరికుమార్, మేనేజర్ శ్రీనివాసన్, డీఈ సుభానీ, ఆర్‌ఓ రంగారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ బాలమురళీకృష్ణ

కౌన్సిల్ తీర్మానంపై రసాభాస

గిద్దలూరు రూరల్: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. 8వ వార్డు కౌన్సిలర్ గడ్డం భాస్కర్‌రెడ్డి, 17వ వార్డు కౌన్సిలర్ దొంత లక్ష్మీదేవిలు నల్లబండ బజారులో రద్దు చేసిన పట్టాకు చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య ప్రోత్సలంతో అధికారులపై ఒత్తిడి తెచ్చి పన్ను వేయించారని ఆరోపించారు. దీంతో చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య పట్టా రద్దు అయిన సంగతి తనకు తెలియదని, అలాగైతే ఆ పట్టాకు సంబంధించిన పన్నును తొలగిస్తే తనకు ఎటువంటి అభ్యంతరం లేదని చెప్పడంతో ఘర్షణ సద్దుమణిగింది. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ, నగర పంచాయతీలోని అధికారులు ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ వారి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారు. కమిషనర్ వై.రామకృష్ణయ్య, వైస్ చైర్మన్ కాతా దీపికా, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బీఎల్‌ఏలను నియమించాలి

దర్శి: ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులు సక్రమంగా జరిగేందుకు ప్రతిపోలింగ్‌స్టేషన్‌కు బీఎల్‌ఏలను నియమించాలని గుర్తింపు పొందిన పార్టీ నాయకులను దర్శి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి యంవీఎస్ లోకేశ్వరరావు కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ ప్రచురించేది 27వ తేదీ, స్పెషల్ క్యాంపెయిన్ నవంబరు 4,5 తేదీలు, డిసెంబరు 2,3 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యంతరాల పరిశీలన డిసెంబరు 26, తుదిజాబితాను జనవరి 5న ప్రచురించనున్నట్లు తెలిపారు. గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్ ఏవీ రవిశంకర్, డిప్యూటీ తహసీల్దార్ టి. దేవప్రసాద్ పాల్గొన్నారు.


సమావేశంలో ఎన్నికల అధికారి లోకేశ్వరరావు

యాజమాన్య పద్ధతులతో లాభాలు


తాళ్లూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

తాళ్లూరు (ముండ్లమూరు): పంటలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. కొత్రపాటివారిపాలెంలో ఆయన మంగళవారం పర్యటించారు. పంటలో కలుపు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు అప్రమత్తంగా ఉండి కలుపును నివారించుకోవాలన్నారు.

కేతగుడిపిలో వీధిలైట్ల ఏర్పాటు

తర్లుపాడు: మండలంలోని కేతగుడిపిలో సచివాలయం కన్వీనర్ కుందురు మల్లారెడ్డి సొంత నిధులతో గ్రామంలో వీధి లైట్లు ఏర్పాటు చేశారు. గ్రామస్తులు, పార్టీ నాయకులు ఆయనను అభినందించారు.


వీధిలైట్ల వెలుగుల్లో కేతగుడిపి గ్రామం

నేడు ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే కేపీ పర్యటన





ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కొనకనమిట్ల సచివాలయం, గార్లదిన్నెలోని ఆర్బీకే

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి బుధవారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి హాజరవుతున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు కొనకనమిట్ల గ్రామ సచివాలయ భవనం, 10 గంటలకు కొనకనమిట్ల–నాగంపల్లి రోడ్డు ప్రారంభం, 10.30 గంటలకు తువ్వపాడు గ్రామ సచివాలయం, 12 గంటలకు గార్లదిన్నె గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభిస్తారని వివరించారు. సాయంత్రం 4 గంటలకు చినారికట్ల గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

తెలుగు రాష్ట్రాల మధ్య కేంద్రం కుట్ర

● సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ



మాట్లాడుతున్న ఎంఎల్ నారాయణ

మార్కాపురం: కృష్ణా జలాల పంపిణీ పేరుతో కేంద్రం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టిందని, తెలంగాణాలో త్వరలో నిర్వహించనున్న ఎన్నికల్లో లబ్ధిపొందాలనే కుట్రతో వ్యవహరిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ విమర్శించారు. మంగళవారం పట్టణంలోని పూలసుబ్బయ్య శాంతి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణాజలాల పునఃపంపిణీ పేరుతో కేంద్ర ప్రభుత్వం అక్టోబరు 4న ఢిల్లీలో అత్యవసరంగా సమావేశాన్ని ఏర్పాటుచేసి బ్రిజేష్‌కుమార్ కమిటీకి అప్పజెబుతూ నోటిఫికేషన్ జారీ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ నోటిఫికేషన్ వలన రాయలసీమతోపాటు, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాలు కూడా ఎడారిలా మారిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సమగ్రంగా చర్చించేందుకు నవంబరు 3వ తేదీన మార్కాపురంలోని పూలసుబ్బయ్య శాంతి భవనంలో రైతులతో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి అందెనాసరయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి శ్రీనివాసులు, ఏఐటీయూసీ కార్యదర్శి ఎస్‌కే ఖాశీం, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ అరికట్టేందుకు చర్యలు

తాళ్లూరు (ముండ్లమూరు): పాలకేంద్రాల్లో జరిగే కల్తీ అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని పశువైద్యశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు బేబిరాణి అన్నారు. తాళ్లూరులో మంగళవారం జగనన్న పాల వెల్లువ గురించి పాడి రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమూల్ పాలకేంద్రాల ద్వారా మిగిలిన డైరీలకంటే లీటరుకు రెండు రూపాయల ఇరవై ఐదు పైసలు అధికంగా చెల్లిస్తామన్నారు. జగనన్న పాలవెల్లువ ద్వారా అమూల్‌కు పాలు పోసే పాడి రైతులకు వరమన్నారు. ఒంగోలు ఉప సంచాలకులు రమేష్‌బాబు, దర్శి సహాయసంచాలకులు పురుషోత్తమరాజు, పశువైద్యాధికారులు ప్రతాప్ రెడ్డి, రాంబాబు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

మార్కాపురం రూరల్: నగదు విషయంలో మాటా మాటా పెరిగి వ్యక్తిపై కర్రతో దాడి చేసిన సంఘటన మండలంలోని ఇడుపూరు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారంజజ ఇడుపూరు గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి పెద్దారవీడు మండలం తంగిరాలపల్లి గ్రామానికి చెందిన సీహెచ్ పోలురాజుకు చెందిన గెదెను ఇటీవల కొన్నాడు. ఈ క్రమంలో అనారోగ్యంతో ఉన్న గెదెను అమ్మావంటూ గేదెను తిరిగి తీసుకుని డబ్బు ఇచ్చేయాలని అడగడంతో సుబ్బారెడ్డిపై పోలురాజు కర్రతో దాడి చేశాడు. గాయపడిన సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ తెలిపారు.

జగనన్న సురక్షతో ఆరోగ్యం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వెంకటరెడ్డి

దర్శి: పేదలందరికీ ఆరోగ్యం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతమైందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి అన్నారు. ఐదో సచివాలయ పరిధిలోని శివరాజనగర్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. వైద్యులు యాతం సురేఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యనిపుణులు ప్రవీణ్ కమల్నాథ్, ప్రసన్నరాణి 814 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి 27 మందిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్ రిఫర్ చేశారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజలందరికీ తమ ఇంటి వద్దే ఆరోగ్యసేవలు అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారాతమ ప్రాంతాల్లోనే ప్రత్యేక క్యాంపులు పెట్టి అన్నిరకాల వ్యాధులకు మెరుగైన వైద్యం అందిస్తుందన్నారు. మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరావు, గ్రీనరీ అండ్‌బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ షకీలా అమిన్‌బాషా, కౌన్సిలర్లు మేడం మోహన్‌రెడ్డి, తాళ్ళూరి బాబూరావు, జేసీఎస్ కన్వీనర్ ఎదురుకోటిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కట్టికోట హరీష్, మాజీ ఎంపీటీసీ కరిపిరెడ్డి సుబ్బారెడ్డి, డైరెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

నికరంపల్లి ఎంపీటీసీ సభ్యుడు మృతి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న కృష్ణమోహన్‌రెడ్డి

మార్కాపురం రూరల్: మండలంలోని నికరంపల్లి ఎంపీటీసీ సభ్యులు తిరుమలరెడ్డి వేమారెడ్డి(60) అనారోగ్య కారణాలతో మంగళవారం మృతి చెందారు. వైఎస్సార్ సీపీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికై న వేమారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ రెండు రోజుల క్రితం కింద పడ్డారు. కుటుంబ సభ్యులు తొలుత ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలకు, మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వేమారెడ్డి మంగళవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, ఎంపీపీ అరుణా చెంచిరెడ్డి, కొండేపల్లి ఎంపీటీసీ మల్లారెడ్డి, కొండేపల్లి మాజీ సర్పంచ్ శివారెడ్డి, సచివాలయ జేసీఎస్ కన్వీనర్ పొందుగుల శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, నాగులవరం సర్పంచ్ రమణయ్య తదితరులు నివాళులర్పించారు.

సంక్షేమ పథకాలు వివరించి జగనన్నను గెలిపించుకుందాం..



మాట్లాడుతున్న కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి

పుల్లలచెరువు: ఈ నాలుగేళ్ల కాలంలో జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్, ఎంపీటీసీలకు మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 9వ తేదీ నుంచి గ్రామాల్లో వైఎస్సార్ సీపీ తరఫున పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేస్తే కలిగే లాభాలు వివరించాలని చెప్పారు. రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రాములు, మండల సచివాలయ కన్వీనర్ డి.వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు కోటిరెడ్డి, రవణారెడ్డి, మస్తాన్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రఘు, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న పాల వెల్లువతో బహుళ ప్రయోజనాలు



రైతులతో మాట్లాడుతున్న డీడీ వెంకట సుబ్బయ్య

పొదిలి రూరల్: జగనన్న పాల వెల్లువతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని మార్కాపురం పశు సంవర్ధక శాఖ డీడీ వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. మంగళవారం పొదిలి పశు వైద్యశాలలో మండలంలోని డెయిరీ రైతులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమూల్ పాల కేంద్రాల్లో పాలు పోసేవారికి అత్యధిక ధర చెల్లిస్తున్నట్లు చెప్పారు. బ్యాంకుల నుంచి త్వరగా రుణం పొందవచ్చన్నారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన పశు గ్రాసం విత్తనాలు సబ్సిడీపై సరఫరా చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏడీ వేణు, వైద్యాధికారి మణిశేఖర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు శిక్షణ

కంభం: మండలంలోని పాఠశాలల్లో ఈ నెల 3న నిర్వహించనున్న స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే కోసం స్థానిక వాసవీ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌కు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా బ్లాక్ కో ఆర్డినేటర్ ఎం.శామ్యూల్ మాట్లాడుతూ సర్వే నిర్వహణ, విధి విధానాలు వివరించారు. ఈ సర్వే ద్వారా జాతీయ స్థాయిలో 3,6, 9వ తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను అంచనా వేస్తారని, సర్వేను సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. మండల విద్యాశాఖాధికారి మాల్యాద్రి, కళాశాల ప్రిన్సిపాల్ రాము, సీఆర్పీలు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

గిద్దలూరు రూరల్: విద్యార్థులు ఉత్తమ భవిష్యత్తును పొందేందుకు ముందుగానే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని మార్గదర్శి జిల్లా పర్యవేక్షకుడు ఎం.రాంభూపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9,10, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మంగళవారం కేరీర్ గైడెన్స్‌పై మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా మీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యను అభ్యసించాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా మీ విలువైన సమయాన్ని చదువుకునేందుకు ఉపయోగించాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ప్రేమ్‌సాగర్, ఉపాధ్యాయులు కాశయ్య, శోభారాణి, వై.శ్రీనివాసులు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్ పోటీలకు మార్కాపురం బాలికలు

మార్కాపురం: కాకినాడలో నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు మార్కాపురం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం తెలిపారు. అక్టోబరు 30న ఒంగోలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి జిమ్నాస్టిక్ క్రీడాకారుల ఎంపికలో అండర్–14, 17 విభాగాల్లో పాల్గొని విజేతలుగా నిలిచినట్లు చెప్పారు. అండర్–17 విభాగంలో పి.లక్ష్య, ఎస్తేర్‌రాణి, స్వాతి, నందిని, లక్ష్మీ మహేశ్వరి, అండర్–14 విభాగంలో ఐశ్వర్య, ఆదిలక్ష్మి, వరలక్ష్మి, అర్చన, శృతి, శ్రీవిద్య ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్యామలాదేవీతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.



జిమ్నాస్టిక్స్ పోటీలకు ఎంపికైన బాలికలు

పౌర హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి

మార్కాపురం రూరల్: మండలంలోని దరిమడుగు గ్రామంలోని ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని మంగళవారం తహసీల్దార్ మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడికి ఉన్న ప్రధాన హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల సోషల్ వెల్ఫేర్ అధికారి అరుణ కుమారి, రాధాకృష్ణ, వీఆర్వో బడే సాహెబ్, సెక్రటరీ నారాయణరెడ్డి, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

4న మండల సర్వసభ్య సమావేశం

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశం హాలులో ఈ నెల 4వ తేదీ ఉదయం 11 గంటలకు మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. విద్యుత్ శాఖ, ఐసీడీఎస్, మండల వ్యవసాయ శాఖపై సమీక్ష జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



మురుగును పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

పెద్దారవీడు: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్యూనిట్ ఆఫీసర్ సీహెచ్ రమేష్ అన్నారు. స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి దేవరాజుగట్టును వైద్య సిబ్బంది మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి ముందు ఉన్న కాలువల్లో మురుగు ఎప్పటికప్పుడు పారే విధంగా చూడాలని, కాలువల్లో చెత్త, వ్యర్థ పదార్థాలు వేయకూడదన్నారు. ఇంట్లో పనికి రాని పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలను వెంటనే కాల్చి వేయాలని, పిచ్చి మొక్కలు, చిల్ల చెట్లను తొలగించాలని సూచించారు. మలేరియా, హెల్త్ సూపర్‌వైజర్లు ఇబ్రాయిల్, సుభానీ, ఆరోగ్య కార్యకర్త మల్లేశ్వరి పాల్గొన్నారు.